www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 సెప్టెంబర్ 2025

నాణ్యమైన పరిష్కారం చూపాలి : జెసి

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రొద్దుటూరు మండలానికి చెందిన చెందిన చిన్న గంగన్న మాదేబ ...గా షుగర్, టీబీ, ఆయాసంతో మంచానికే పరిమితం అయ్యానని సదరం ద్వారా 75 శాతం సర్టిఫికెట్ ఇచ్చారని పింఛన్ మంజూరు ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని కోరారు. సిద్దవటం మండలం కడపాయపల్లెకు చెందిన నల్లా వెంకటేశ్వర్లు తమ పిల్లలకు తల్లికి వందనం నగదు తమకు ఇప్పించాలని అర్జీని సమర్పించారు. కడప చిన్న చౌకకు చెందిన కె. పద్మావతి దేవి తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

కడప టిడిపిలో లుకలుకలు!

- ఎమ్మెల్యేపై ద్వితీయ శ్రేణి తిరుగుబాటు
- మంచిబుద్ధిని ప్రసాదించాలని దేవుని కడపలోప్రార్థనలు
- టిడిపి సీనియర్ నేత 'పుత్తా' వద్దకు అసంతృప్తులు

పుత్తా నరసింహారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అసంతృప్త నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప టిడిపిలో అసమ్మతి భగ్గుమంది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డిపై స్వపక్ష, మిత్రపక్షాల నుంచి అసంతృప్తుల జడివాన కురుస్తోంది. ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఏళ్ల తరబడి జెండా మోసిన సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో అన్యాయం చేయడం, అర్హులైన కార్యకర్తలకు కాంట్రాక్టు పనుల కేటాయింపుల్లో మొండిచెయ్యి చూపించడం వంటి విషయాలపై కేడర్ నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సోమవారం టిడిపి సీనియర్ నాయకులు పాతకడప కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డిలతో కూడిన పలువురు నాయకులు ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్.శ్రీనివాసరెడ్డికి మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ దేవుని కడప ఆలయంలో ప్రార్థనలు చేయడంతో అసంతృప్తి పతాక స్థాయికి చేరుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆర్.మాధవిని గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డిన తమను కాదని, ఎన్నికల అనంతరం తమ ఆస్తులను కాపాడుకోవడం కోసం పూర్వాశ్రమంలో టిడిపిలో చేరిన ఎనిమిది మంది వైసిపి కార్పొరేటర్లకు ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని నిలదీస్తున్న వైనం ఆసక్తికరంగా మారింది.

ఎన్నికల్లో స్వపక్షం నుంచే అసంతృప్తి

సార్వత్రిక ఎన్నికల ప్రచార దశ నుంచే కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్.శ్రీనివాసరెడ్డి వ్యవహార సరళిపై అసమ్మతి బుసలు కొడుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో టిడిపి సీనియర్లు అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మీరెడ్డి, అమీర్‌బాబు, దుర్గాప్రసాద్ వంటి సీనియర్లు నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైన సంగతి తెలిసిందే. అసమ్మతిని లెక్క చేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించి గట్టెక్కారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన 15 నెలల అనంతరం తాజాగా పాత కడపకు చెందిన టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి బృందాల నుంచి ఎదురైన తీవ్ర వ్యతిరేకత కలకలం రేపుతోంది.

మిత్రపక్షంలోనూ అసమ్మతి

జిజిహెచ్ డైరెక్టర్ల, న్యాయస్థానాల్లో ఏకపక్ష నియామకాలపై కూటమి నాయకుల్లో అసంతృప్తి బుసలు కొట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్ర కేబినెట్‌లో బిజెపికి చెందిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ శాఖలో చోటుచేసుకున్న ఏకపక్ష నియామకాలు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి కడప నాయకుల వైఖరిపై కూటమి రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే. స్వపక్షం, మిత్రపక్షమనే భేదం లేకుండా అసంతృప్తుల జడివాన కురుస్తుండడం గమనార్హం.

టిడిపి సీనియర్ నాయకులు 'పుత్తా'కు వినతి

దేవునికడప ఆలయంలో టిడిపి తిరుగుబాటు నాయకులు ఎమ్మెల్యేకు మంచిబుద్ధిని ప్రసాదించాలని ప్రార్థనలు చేయడం అందరిదృష్టిని ఆకర్షించింది. ప్రార్థనల అనంతరం కమలాపురం టిడిపి సీనియర్ నాయకులు పుత్తా నరసింహారెడ్డిని కలిసి టిడిపి కేడర్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను వివరించడం చర్చనీయాంశంగా మారింది.

రహదారి ఏర్పాటు చేయకపోతే

పోరాటం ఉధృతం : సిపిఎం

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చెర్లోపల్లివాసులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరం శివారు ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లి లే అవుట్‌లో తక్షణమే రహదారి ఏర్పాటు చేయాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట చెర్లోపల్లి లే అవుట్‌లో రహదారి ఏర్పాటు చేయాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ కడప నగరంలో ఉన్న నిరుపేదలను గుర్తించి వారందరికీ చెర్లోపల్లి లే అవుట్ లో ఇంటి పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం అనేక మంది పేదలు కడప నగరంలో పెరిగిన ఇంటి బాడుగలు చెల్లించలేక తమకు ఇచ్చిన ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి కృషి చేశారన్నారు. ఈ తరుణంలో అక్కడ ఇళ్లు నిర్మించుకున్న ప్రజలు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చెర్లోపల్లి లే అవుట్‌లో తూర్పు వైపు ఉన్న కాలనీకి రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇంకా శ్మశానం, విద్యుత్, డ్రెయినేజీ, మంచి నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో అనేకసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసిన స్పందన లేదన్నారు. కాలనీ ఏర్పడి 17 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. తక్షణమే రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఏమాత్రం కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహ, గోపాల కృష్ణయ్య, తిమ్మయ్య, గోవిందు, నారాయణరెడ్డి, ప్రవీణ్ కుమార్, శేఖర్, సుబ్బారాయుడు, రఘు, రవి, విజయ్, ఉదయ్, కృష్ణారెడ్డి, వసంత కుమారి, శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్బయ్య, మల్లేశ్వరయ్య, రామకృష్ణ, శంకర్, షాహిదా బాను, సావిత్రి, కళావతి, సురేంద్ర, రవిశంకర్, ఆంజనేయులు, మల్లేశ్వర రెడ్డి, రవి, మత్తయ్య, అరిపుల్లా, మహేందర్, సుబ్బారాయుడు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తక్షణం రైతులను ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - కడప : చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచేస్తుందని, వారిని తక్షణమే ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. యూరియా సరఫరా సరిగ్గా లేక రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. సోమవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చి 17 నెలలు అవుతుందన్నారు. ఎన్నికల ముందు పేదరికం లేకుండా చేసి ప్రజలను కోటీశ్వరులను చేస్తామని, సంపద సృష్టిస్తామని చంద్రబాబు నాయుడు మోస పూరిత మాటలు చెప్పారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తరువతా రైతులను రోడ్డున పడేసారన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు వెళ్లిపోతున్నాయని, ప్రభుత్వం ఎరువుల సరఫరా నిలిపేయడంతో బ్లాక్ మార్కెట్‌లో ధరలు పెరిగిపోయారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో చాలా మేలు రైతులకు చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజలు అన్నీ గమని స్తున్నారు, త్వరలోనే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

స్టేషన్‌కు వెళ్లాలంటే పేదలకు భయం : కాంగ్రెస్

ప్రజాశక్తి- కాశినాయన : నరసాపురం పోలీస్ స్టేషన్‌కు బడుగు బలహీన వర్గాలు పేదలు వెళ్లాలంటే భయపడుతున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుల్లూరు ఖాజావలి అన్నారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో రాజకీయ నాయకుల అండలేకుండా ఎవరైనా స్టేషన్‌కు వెళితే వారిని నానా విధాలుగా ఇబ్బందులు పెడుతున్నారని, పైగా టిడిపి వారి పేరు చెబితేనే కేసు కడతామని ప్రజలు తమ పార్టీ దృష్టికి తెచ్చారని అన్నారు పేద ప్రజలపై తప్పుడు కేసులు బనాయించడం బధాకరమని వాపోయారు. దీనిపైన ఎస్పి స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

గ్రీవెన్స్ సెల్‌కు అధికారుల డుమ్మా

ప్రజాశక్తి-కాశినాయన : నరసాపురం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని అధికారులు డుమ్మా కొట్టారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ఏర్పాటు చేస్తే ఒక్క తహశీల్దార్ తప్ప మిగిలిన అధికారులు గైర్హాజరవడంపై ప్రజలు అసహనానికి గురయ్యారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు నిరాశతో బాధతో వెనుతిరిగారు. కలెక్టరేట్‌కు వెళ్లి తమ సమస్యలను చెప్పుకోలేక మండల కేంద్రంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామనుకుంటే వారు దుమ్మా కొట్టడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఆయా శాఖల అధికారులు గైర్హాజరు సమాచారం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, విఆర్‌ఒలు, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రయివేట్ టీచర్లకు సెలవులివ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు ప్రకటించిందని, జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రయివేట్ పాఠశాలలు యాజమాన్యాలు యథేచ్ఛగా నడుపుతున్నాయని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సెలవులలో ప్రయివేట్ టీచర్లకు తప్పకుండా పాఠశాలలకు రావాలని యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయని పేర్కొన్నారు. ఒకవైపు విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా పాఠశాలలు నడపడం మరోవైపు సెలవులు ఇచ్చినా టీచర్లను పిలిపించడం చేస్తున్నారన్నారు. సెలవులు ఇవ్వకుండా బలవంతంగా పాఠశాలలు నడిపితే ఆందోళన చేస్తామని తెలిపారు.

రైతులకు పరిహారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నాలుగు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహార ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి కోరారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయని చెప్పారు. ఉల్లి, పత్తి, కంది, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో భూములు కోతకు గురయ్యాయని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు రబీ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, మందులు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు భారీ వర్షాలతో పంటలు కోల్పోయి ఇబ్బందులు గురవుతున్నా మరో పక్క జిల్లాలో ఎరువులు, మందులు, నాసిరకం విత్తనాలు ఇష్టారాజ్యంగా అధిక రేట్లకు అమ్ముతున్నా వ్యవసాయ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. ఎరువుల దుకాణాలపై జిల్లా ఉన్నత అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-కాశినాయన : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని పోరుమామిళ్ల సిఐ డి. శ్రీనివాసులు తెలిపారు. ఎస్పి నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వు మేరకు, మైదుకూరు డిఎస్పి జి. రాజేంద్ర ప్రసాద్ ఆదేశానుసారం కడప పోలీస్ కళాజాతా బృందం వారు జి. నర్సరామ్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల టౌన్ లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 'యువతా మేలుకో' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, వాటి నుండి ఎలా బయటపడాలి వంటి వాటిపై నాటక రూపంలో ప్రదర్శించారు. ప్రతి కళాశాలలో ఒక ఈగిల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మత్తు పదార్థాల సమాచారాన్ని ఈగిల్ టీం కు కానీ, పోలీస్ వారికి కానీ సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోరమామిళ్ల సిఐ డి. శ్రీనివాసులు, పోలీసులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కాశినాయన

కార్యక్రమం ప్రారంభిస్తున్న డిసిసి అధ్యక్షులు

ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం బద్వేల్ నియోజకవర్గం కలసపాడులో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా విషయంలో అవకతవకలు సృష్టించి అనేక దొంగ ఓట్లను నమోదు చేసి ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తుందని పేర్కొన్నారు. దీనిపైన కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా లక్ష సంతకాల సేకరణ చేసి ఓట్ చోరీకి వ్యతిరేకంగా ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు డాక్టర్ అన్వర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్న రామిరెడ్డి, కలసపాడు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, బి. కోడూరు మండల అధ్యక్షుడు గుర్రప్ప, కాశినా యన మండలం అధ్యక్షుడు పుల్లూరు ఖాజావలి, నాయకులు కిషోర్, ముజాహిద్, సాల్మన్, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

13 గంటల పని దినాలను రద్దు చేయాలి

- కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 8 గంటల పనిని రద్దుచేసి 13 గంటల పని దినాల చట్టాన్ని తీసుకురావడం దారుణమని, తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 1886 సంవత్సరం అమెరికా చికాగో నగరంలో కార్మికులు ప్రాణాలు తెగించి పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాలను రద్దుచేసి 13గంటల పని దినాన్ని అమలుకు చట్టం తీసుకురావడం దుర్మార్గమని తెలిపారు. రాత్రి వేళల్లో మహిళలకు డ్యూటీలు వేయడం దారుణమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కుల కన్నా కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలకు మద్దతు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. అధికారం రాక మునుపు ఒక మాట, అధికారంలోకి వచ్చిన నాక మరొక మాట మాట్లాడడం ఘోరమని తెలిపారు. కార్మికుల పోరాటం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కార్మికులకు, ఉద్యోగులకు వ్యతిరేకంగా పని చేయడం సరైంది కాదన్నారు. పరిశ్రమల్లో, దుకాణాలలో 13 గంటలు పని చేయాలని సిఫారసు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని కోరారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి వరప్రసాదరావు, పవన్, సిఐటియు నాయకులు ఉదయ్, డివైఎఫ్ఐ నాయకులు విజయ్, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, వెంకటేష్, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, పెన్షన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రఘు, తిమ్మయ్య, నారాయణరెడ్డి, మెడికల్ రెప్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రామానుజులరెడ్డి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** 139 సంవత్సరాల పోరాట ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను 13 గంటల పని దినాలు చేయడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆలోచనలు తిరోగమనంలో సాగుతున్నాయని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో 8 గంటల పని, ఒత్తిడి తగ్గకపోగా, 13 గంటల పని విధానం తేవడమంటే కార్మికులను శారీరకంగా, మానసికంగా అధిక ఒత్తిడికి గురిచేయడమేనని చెప్పారు. ఇది కార్మిక హక్కులపై దాడి అని, వారి జీవన ప్రమాణాలను, కుటుంబ జీవితాన్ని నాశనం చేయడమేనని తెలిపారు. కార్మికులు తమను తాము విముక్తి చేసుకోవాలంటే, ఐక్యంగా, సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

'లోకనాథం'కు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యాశాఖ అధికారిగా విరమణ చేసి 60 సంవత్సరాల తర్వాత పద్యంపై మక్కువ పెంచుకుని గర్భ, బంధ కవిత్వాలను రాస్తున్న' విద్యా తపస్వి' అభినందనీయుడని ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు వారు ప్రతిష్టాత్మకంగా ఇచ్చే 'కీర్తి' పురస్కారాన్ని ఈనెల 23న హైదరాబాదులో స్వీకరించనున్నారని, ఇది మన జిల్లాకు గర్వకారణమని అన్నారు. ఎం.వి.లోకనాథం కీర్తి పురస్కారం అందుకుంటున్న సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం, సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ శతకాలు, పద్య కావ్యాలు దాదాపు 50 కి పైగా రాసిన లోకనాథం ఒంటిమిట్ట కోదండ రాముని పైన అనేక గ్రంథాలు రచించారని చెప్పారు. కార్యక్రమంలో సోమ కళానాథరెడ్డి, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ జీవి సాయి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కోడూరు సుమన శ్రీ, సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ వైస్ చైర్మన్ పసుపులేటి శంకర్, దిలీప్ కుమార్ జైన్, గొరిగ వెంకటేశ్వర్లు, ఈశ్వర రెడ్డి,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎంబిబిఎస్ ఓరియంటేషన్ తరగతులు

ప్రజాశక్తి - కడప సిటీ

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

కడప రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సోమవారం తొలి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వారి విద్యా ప్రయాణం ఎలా ఉండాలి, చదువుపై దృష్టి ఎలా పెట్టాలి, క్యాంపస్ వాతావరణం ఎలా ఉంటుంది వంటి విషయాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ప్రతి డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు తమ పరిచయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. వారు తమ సందేశాల్లో విద్యార్థులకు విద్య, నైతిక విలువలు, భవిష్యత్తులో ఒక మంచి వైద్యులుగా ఎలా ఎదగాలి అనే విషయాలపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ కొత్త ప్రయాణాన్ని ఆరంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ టి. జమున, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెంటల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పెంచలయ్య, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆందోళన చేస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలు

విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రయివేట్ డిగ్రీ విద్యా సంస్థల యాజ మాన్యాలు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రూ. 6,400 కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని సోమవారం నగరంలో కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయివేట్ డిగ్రీ విద్యా సంస్థలు, యాజమాన్యాలు, అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫీజు బకాయిలను మాఫీ చేస్తామని, ఏ ఒక్క విద్యార్థికి అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నేడు మాట తప్పి దాదాపు రూ. 6,400 కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో పెట్టడం సరైంది కాదన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి కనబడలేదా అని ప్రశ్నించారు. మరోకవైపు ప్రభుత్వం 'సూపర్ సిక్స్ –సూపర్ హిట్' సభల పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజులను చెల్లించడంలో సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలు చెల్లించాలని, లేదంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, శ్రీనివాసులు,సంజీవ్ రెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నాయకులు అంకన్న, సుబ్బారాయుడు, జయవర్ధన్, ఓబులేసు, నాగరాజు, చంద్ర, జగన్ నాయక్, బాబు రాజేంద్ర, గోపి, నవీన్, నాగూర్, పండు, సురేంద్ర పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌పికి మొక్కను అందజేస్తున్న నాయకులు

ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను ఎన్‌జి జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, కార్యదర్శి నిత్యపూజయ్య, కోశాధికారి శ్రీ నివాసులు, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్ పద్మనాభ రావు కలిశారు. ఎస్‌పి మాట్లాడుతూ తమ పరిధి లో ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

డిమాండ్లు సాధించే వరకూ ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - కడప

జెసిని సమస్యను వివరిస్తున్న విద్యుత్ జెఎసి నాయకులు

కడప జిల్లా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు విద్యుత్ జెఎసి పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ సోమవారం కడప నగరంలో విద్యుత్ జెఎసి చైర్మన్ బర్నబాస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు, ఉద్యోగులు కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలతో సమస్యలను పరిష్కరించాలంటూ ప్ల కార్డులు బ్యానర్లతో ర్యాలీ నిర్వహిస్తూ డిమాండ్ చేశారు. అంతకుముందు కడప విద్యుత్ భవనం సర్కిల్ వద్ద ఉన్నటువంటి మోక్షగుండం విశ్వేశ్వరయ్య , బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాల అర్పించారు. అక్కడి నుండి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వెళ్లి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జెసికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ జెఎసి చైర్మన్ జెసికి విద్యుత్ కార్మికులు ఉద్యోగుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ బండి రామలింగారెడ్డి జెఎసి జిల్లా కన్వీనర్ చలపతి, జెఎసి జిల్లా వైస్ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డితో పాటు జెఎసి నాయకులు పురుషోత్తం, నాగిరెడ్డి, మురళి, నాగ శేషారెడ్డి, నాగరాజు, ఫయాజ్ బేక్, రామకృష్ణ, మూర్తి, యాకోబు, కేశవ్ రెడ్డి పెద్ద ఎత్తున ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

నేటి ప్రపంచానికి దీపదారి గురజాడ

ప్రజాశక్తి - కడప అర్బన్

నేటి ప్రపంచానికి దీపదారి గురజాడ అప్పారావు అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సోమవారం కోటిరెడ్డి మహిళా కళాశాలలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.వి.ఎన్ సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచనలు, ఆలోచనలు ఆయన సంఘసంస్కరణ దృక్పథంతో రాసిన కన్యాశుల్కం, పూర్ణమ్మ నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమన్నారు. గురజాడ అప్పారావు రాసిన దేశభక్తి గేయానికి ప్రపంచ గేయంగా నిలవగలిగే అర్హత ఉందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ లెక్చరర్ డాక్టర్ షార్జియా బేగం, పొలిటికల్ సైన్స్ లెక్చరర్ డాక్టర్ పి.వి. సుబ్బారెడ్డి, జి.పి.ఆశాలత, విద్యార్థులు పాల్గొన్నారు.

శైలపుత్రి దేవి అలంకారంలో విజయదుర్గాదేవి

ప్రజాశక్తి- కడప అర్బన్

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కడప శ్రీ విజయదుర్గాదేవి ప్రథమ స్వరూపమైన శైలపుత్రి అలంకారంలో మొదటి రోజున దర్శన మిచ్చారు. ఆలయంలో శ్రీ విజయదుర్గాదేవికి తెల్లవారుజామున పుణ్యనది జలాలతో నిండిన 9 విశేష కళాశాలతో నవకలశస్నపనం (విశేష అభిషేకం) వైభవంగా నిర్వహించారు. సుస్వర వేదమంత్రాలు, మంగలవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం, అనంతరం చండీహోమ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 6 గలకు ఆలయంలో మొదటిరోజు పూజ కార్యక్రమంలో భాగంగా 'అష్టదళపద్మారాధన' కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు దుర్గా ప్రసాద్ కుటుంబసమేతంగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీ విజయ దుర్గ మల్లికార్జునులను సింహ వాహనంపై ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

రణభేరి మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 25న శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో కరపత్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధ నేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, అస్తవ్యస్తంగా పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని, 12వ పిఆర్‌సిని ప్రకటించాలని, అంతవరకూ 29 శాతం మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిర్వహించబోయే రణభేరిలో ఉపాధ్యాయులు పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ,ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు బత్తుల చంద్రశేఖర్, మహబూబ్ బాషా, ప్రకాష్ బాబు, సుబ్బారావు, రామకేశవ, గురు మోహన్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 119 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి విచ్చేసిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకే ఎస్పీ వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్. సుధాకర్, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

ఆర్‌టిపిపిలో కొనసాగుతున్న ఆందోళన, ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపిలో కార్మికుల ఆందోళనలు రోజురోజుకూ ఉద్రిక్తతగా మారుతున్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో 23 సంఘాలు ఓవైపు సమ్మెకు పిలుపునిచ్చి, ఎనిమిది రోజులుగా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేస్తున్నారు. మరోవైపు తెలుగు నాడు సంఘంతోపాటు మరో సంఘం కలిసి రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో గత శనివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. సమస్య పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం, ఇరు వర్గాలు కలిసి మళ్లీ సమ్మె కొనసాగించేందుకు అంగీకరించడం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం యధావిధిగా 23 సంఘాలు కలిసి ర్యాలీ నిర్వహించి మెయిన్ గేటు వద్ద ఎస్ఈ ఏడిఎం సోమశేఖర్ రెడ్డికి వినతిపత్రమిచ్చారు. తెలుగు నాడు సంఘం ఆధ్వర్యంలో వేరుగా కార్మికులు, ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం మెయిన్ గేటు వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ క్రమంలో ఘర్షణలు జరగకుండా నియంత్రించేందుకు పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.

నేటి నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆధార్ కార్డులు ఇంకా చాలా వరకు బయోమెట్రిక్ అప్డేషన్, డాక్యుమెంట్స్ అప్డేషన్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని అప్డేషన్ చేసేం దుకు ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కొత్త ఆర్‌టిసి బస్టాండ్, ముద్దనూర్ రోడ్ మిని సెక్రటేరియట్, అంబకపల్లి రోడ్డులో ఆధార్ కేంద్రములు ఏర్పాటు చేశామన్నారు.

టిటిడి కల్యాణమండపాన్ని పరిశీలిస్తున్న ఎన్.తులసిరెడ్డి

టిటిడి కల్యాణ మండపాన్ని త్వరగా ప్రారంభించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో అన్ని విధాలా పూర్తయిన టిటిడి కల్యాణమండపాన్ని సంబంధిత అధికారులు త్వరగా ప్రారంభించాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి కోరారు. సోమవారం కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన కల్యాణ మండపాన్ని సందర్శించారు. అనంతరం తులసిరెడ్డి పేదలకు, మధ్యతరగతి వారికి అనుకూలంగా ఉండే విధంగా టిటిడి అధికారులు 20ఏళ్ల క్రితం వేంపల్లెలో టిటిడి కల్యాణమండపాన్ని నిర్మించారన్నారు. నిర్వహణ సరిగా లేని కారణంగా అది శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఆ కల్యాణ మండపాన్ని కూలగొట్టి మళ్లీ రూ.2కోట్ల 30లక్షలతో నూతన కళ్యాణమండపాన్ని నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లె మండలశాఖ అధ్యక్షులు రామకృష్ణ, బండారు వెంకటేశు, పోతి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రవి, చిలేకంపల్లి వెంకట సుబ్బారెడ్డి, శివారెడ్డి, రమణ, చిన్నకోట్ల నాగరాజు, కొత్తూరు నాగరాజు పాల్గొన్నారు.

3న గండిలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో టెంకాయలు అమ్ముకొనుటకు అక్టోబర్ 3న ఇ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఇఒ జె.వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. కమిషనర్ దేవాదాయ శాఖ విజయవాడ ఉత్తర్వులు మేరకు లోబడి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం పాటలో హిందూ మతస్తులు మాత్రమే పాల్గొనాలన్నారు. పాల్గొనేవారు రూ.10 లక్షలు డిపాజిట్ చెల్లిం చాల్సి ఉందన్నారు. హెచ్చు పాటదారుడు వేలం ముగిసిన వెంటనే మొత్తంలో డిపాజిట్‌తో కలిపి 50 శాతం చెల్లించాలన్నారు. మిగతా 50 శాతం కమిషనర్ దేవాలయ శాఖ విజయవాడ వారి మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే లేదా మూడు నెలలు కాల వ్యవధిలో చెల్లించాలని వివరించారు. పై తెలిపిన హక్కును నిలుపు దల చేయుటకు, వాయిదా వేయుటకు కార్యనిర్వహణాధికారికి పూర్తిగా అధికారం ఉందన్నారు.

డిప్యూటీ సిఎం పవన్‌పై విమర్శలు శోచనీయం

వేంపల్లె : డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై పబ్లిసిటీ కోసం వైసిపి నేత బైరెడ్డి సిద్దార్థరెడ్డి రీల్స్ చేస్తూ విమర్శలు చేయడం శోచనీయమని కూటమి నేతల రామమునిరెడ్డి, డాక్టర్ హరీష్, గాలి హరి, సుష్మా ఖండించారు. స్థానిక అర్అండ్‌బి అతిథిగృహంలో సోమవారం కూటమి నేతలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బైరెడ్డి నోటికి వచ్చినట్లు మాట్లాడం మంచిది కాదన్నారు. నాసిరకం మద్యం వల్ల వైసిపి ప్రభుత్వ పాలనలో ఎంతోమంది చనిపోయినట్లు చెప్పారు. కుంభ కోణాలు చేసే పార్టీ వైసిపి అన్నారు.

అల్లాడుపల్లె దేవళాలు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్ తెలిపారు. సోమవారం దసరా నవరాత్రులు ప్రారంభం సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతారని తెలిపారు. భక్తుల సహకారంతో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరారెడ్డి, ఓం మహేశ్వర్‌రెడ్డి, టిడిపి యువ నాయకులు గుత్తి వీర నారాయణ యాదవ్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం నిర్వహిస్తున్న చైర్మన్ వీర నారాయణ యాదవ్

దానిమ్మ దిగుబడి బాగున్నా.. ధర లేదన్నా..!

టన్ను రూ.60 వేలలోపే - పెట్టుబడులు కూడా రాలేదంటున్న రైతులు - గిట్టుబాటు ధర కోసం ఎదురుచూపులు

సాగులో ఉన్న దానిమ్మ పంట

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దానిమ్మ ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నానాటికీ తగ్గుతున్నాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నెలరోజుల క్రితం ఉన్న ధరలు అమాంతం తగ్గి సగానికి పడిపోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీసం పెట్టుబడులైనా వస్తాయా.. రావా.. అన్న ఆందోళనలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే దానిమ్మ ధరలు సగం పైగానే తగ్గిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలో చీనీ పంటకు తెగులు సోకి అధికంగా చెట్లు ఎండిపోతుండడంతో చాలామంది రైతులు దానిమ్మ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. లింగాల, పులివెందుల మండలాల్లో దానిమ్మ ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో పంట సాగులో ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. గతంలో ధరలు ఎక్కువగా ఉండడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది ధరలు తగ్గుముఖం పట్టడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

టన్ను రూ.60వేలలోపే..

ఎకరా దానిమ్మ సాగుకు రూ.లక్ష నుంచి రూ.లక్ష యాభై వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. దిగుబడి బాగానే వచ్చింది. టన్ను ధర ప్రస్తుతం రూ.60వేలలోపే పలుకుతోంది. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి. సరిగ్గా ఏడాది క్రితం దానిమ్మ టన్ను ధర రూ.1.20 లక్షలు పలికి రైతులకు సిరులు కురిపించింది. ఈసారి కూడా ధరలు బాగుంటాయనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది.

ఇతర రాష్ట్రాల్లో మంచి దిగుబడులు..

ఇతర రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఎపిలో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. నవంబరు నుంచి అయినా ధరలు పెరుగకపోతాయా అన్న ఆశతో రైతులు ఉన్నారు. అప్పుడు కూడా ధరలు పెరగకపోతే నష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానిమ్మ కాయలను మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, చెన్నయ్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో పంట ఎక్కువగా వస్తుండడంతో తెలంగాణ, చెన్నయ్‌కి నామమాత్రంగా ఎగుమతి చేస్తున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు..

దానిమ్మ ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడి కూడా రాదు. ఎకరాకు పెట్టుబడి రూ.లక్ష నుంచి రూ.లక్ష యాభై వేల వరకు వచ్చింది. దిగుబడి బాగున్నా.. ధరలు తగ్గడం కలవరపెడుతోంది. నాలుగెకరాల్లో దానిమ్మ సాగుచేశా. రానున్న రోజుల్లోనైనా ధరలు పెరిగితే కొంత ఉపశమనం దక్కుతుంది. **- కృష్ణారెడ్డి, రైతు, పులివెందుల**

ప్రస్తుత ధరలతో నష్టమే..

దానిమ్మ ధరలు తగ్గడంతో పంటను అమ్ముకోలేకున్నాం. కొన్నిచోట్ల పంట కోత దశకు రావడంతో నష్టానికే విక్రయించాల్సి వస్తోంది. ఏడెకరాల్లో పంట సాగుచేశా. పంటలో సస్యరక్షణ చర్యలు తప్పకుండా చేపట్టాల్సి ఉంటుంది. లేకపోతే దానిమ్మ కాయలు దెబ్బతిని మొదటికే మోసం వచ్చే ప్రమదం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారు. **- మదన్ మోహన్‌రెడ్డి, రైతు, లింగాల**

గోడపత్రాలను విడుదల చేస్తున్న డాక్టర్ ఖాజా మొహిద్దీన్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. పులివెందుల నగరిగుట్ట పట్టణ ప్రాథమిక వైద్యశాలలో స్వస్థ్ నారీ స్వసక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ ఖాజా మొహిద్దీన్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్, సూపర్‌వైజర్ సతీష్, సీడీఎస్ మేనే జర్ వలి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు గోడ పత్రాలను ఆవిష్కరించారు. వైద్యశిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు. హెచ్‌ఐవి, క్షయ, టిబి వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎం సుబ్బారెడ్డి, టీబీ, ఐసీటీసీ కౌన్సిలర్‌లు భాగ్యలక్ష్మి, వెంకటసుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, సీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోందని, ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి సూచించారు. సోమవారం మండల పరిధిలోని నాగసానిపల్లె అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు త్వరలో ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని అందజే యనుందన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పక తీసు కోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

అయ్యప్ప ఆలయానికి సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని పూసలకొట్టాలు సమీపాన ఉన్న హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ దారి నిర్మాణానికి సోమవారం పనులు ప్రారంభించారు. నూతనంగా సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, స్థానిక నాయకులు ఇరగంరెడ్డి ప్రతాపరెడ్డి, నంద్యాల సుబ్బయ్య యాదవ్, ఆలయ చైర్మన్ పత్తి కృష్ణారెడ్డి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చేందుకు మట్టి దారి ఉండడం వల్ల ఇబ్బందిగా ఉండేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నదిలోకి పిల్లలు వెళ్లకుండా చూడండి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని పాపాగ్ని నదిలోకి ఎవరూ వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి కోరారు. సోమవారం స్థానిక పాపాగ్ని నది ప్రాంతంలో ఎస్ఐ రంగారావు ఆదేశాల మేరకు తెలంగాణ వలి ఆధ్వర్యంలో గుంతలు ఉన్న చోట ప్రమాద సూచికను తెలుపుతూ ఎర్ర జెండాలను టిడిపి కార్యకర్తలతో పాతించారు. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాపాగ్ని నదికి పైతట్టు ప్రాంతాల నుండి వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. నదిలో ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరగడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన వారిలో టిడిపి నేతలు ఫారూఖ్, మహమ్మద్, మదార్, హైదర్, దర్బార్, మౌల్లా, నజీర్ పాల్గొన్నారు.

పేరు మార్పు

వైయస్ఆర్ కడప జిల్లా, ఒంటిమిట్ట మండలం, పెన్నపేరూరు గ్రామం, డోర్ నెంబర్ 1/100, కాపురస్తులైన ఈరి పెద్ద గోపయ్య కుమారుడు అయిన ఈరి రామక్రిష్ణ అను నేను ఈ దినం నుండి ఈరి క్రిష్ణయ్యగా పేరు మార్చుకున్నాను.

పాస్‌పోర్ట్ పోయినది

వైయస్ఆర్ కడప జిల్లా, ఒంటిమిట్ట మండలం, పెన్నపేరూరు గ్రామ పంచాయతీ, పెన్నపేరూరులో నివాసం వుంటున్న వనమాల సుధాకర్ కుమారుడు వనమాల నిఖిల్‌కి చెందిన ఒరిజినల్ పాస్‌పోర్టు ఈ నెల 16వ తేదీన ఒంటిమిట్ట బస్టాండులో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెంబర్ T4189118 పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 9000608031 మొబైల్ నెంబరుకు గాని తెలుపగలరు.

గౌతమ్ స్కూల్‌కు నోటీసులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యా శాఖ ఆదేశాలను ఉల్లంఘించినందుకు గౌతమ్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని ఎంఇఒ చంద్రశేఖర్ రావు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం.. ఈనెల 22 నుండి అక్టోబర్ 2 వరకు అన్ని గుర్తింపు పొందిన విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించారు. జమ్మలమడుగు పట్టణంలోని ప్రతి ప్రయివేట్ పాఠశాలకు ఆ సూచనలను ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాల ద్వారా తెలియజేశామన్నారు. ఆ ఆదేశాలను పాటిం చకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా కూడా తెలియ జేశామన్నారు. గౌతమ్ ఇఎం హైస్కూల్ ఆ సూచనలను ఉల్లంఘించి పరీక్షలు నిర్వహించిందని, ఆధారాలతో సహా ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలను విస్మరించినందుకు మీ సంస్థపై ఎందుకు చర్య తీసుకోకూడదో, మీ పాఠశాలకు మంజూరు చేసిన గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలన్నారు. నోటీసు అందిన వెంటనే మీ వివరణను సమర్పించాలని ఆదేశిస్తున్నామని నోటీసులో ఎంఇఒ తెలిపారు.

ప్రయివేట్ టీచర్లకు సెలవులు ఇవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ప్రకటించిందని, ఆ మేరకు ప్రయివేట్ టీచర్లకు కూడా ఆ విద్యా సంస్థల యజమానులు అమలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ కోరారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దసరా సెలవులలో ప్రయివేట్ టీచర్లు తప్పకుండా పాఠశాలలకు రావాలని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయని అన్నారు. సమావేశంలో కుమార్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా సెలవులు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలకు ప్రకటించిందని, జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసకోవాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు కరిష్మా, శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వస్థ్ సశక్తి నారీ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథులుగా ఎంపిటిసి వెన్నపూస లక్ష్మి కాంతమ్మ, ఎంపిడిఒ రాధాకృష్ణవేణి పాల్గొన్నారు. చిన్నపిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్, మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ శిల్ప, డెంటల్ వైద్యులు సబిత, కంటి వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మిదేవి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ తేజ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, నాగమునిరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రామారావు, జయమ్మ, ఆయుష్ డాక్టర్ సూర్యకుమారి, సుకన్య, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మాసిస్ట్ జగదీష్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ జయకుమార్, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు విశాలాక్షి, లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల : వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పెద్ద జూటూరు గ్రామపంచాయితీ విలేజ్ హెల్త్ కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ అఫ్రీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి అరుణకుమారి, హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉషారాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, మేల్ అసిస్టెంట్ శ్రీనివాస్ మూర్తి, సచివాలయం ఎంఎల్‌హెచ్ పి/సిహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, 104 వాహనం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అంకాలమ్మ తల్లి దేవస్థానంలో వైసిపి నాయకుల పూజలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో వెలసిన అంకాలమ్మ తల్లి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అర్చకులు మొదటి రోజు సోమవారం అమ్మవారికి కంకణ పూజ చేశారు. ఈ సందర్భంగా వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, నాయకులు చంద్రమౌళి, దాసరి చంద్రమౌళి పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టు ప్రొద్దుటూరు నందు

E.P.No. 73/2023 in O.S.No. 34/2012

ఎర్రమల శ్రీనివాసులు రెడ్డి S/o శ్రీరాములు రెడ్డి, డి.నెం.6/204,సర్వరాజుపేట,పెద్దనపాడు పోస్టు & గ్రామం, యర్రగుంట్ల(మం),కడప జిల్లా ....పిటిషనర్/D.Hr

VS

సయ్యద్ మహబూబ్ షరీఫ్,S/o సయ్యద్ సర్దార్ మోహిద్దీన్, డి.నెం.5/173,పోలీస్ స్టేషన్ లైన్ వెనుక వైపు, యర్రగుంట్ల గ్రామం & పోస్టు,మండలం,కడప జిల్లా ....రెస్పాండెంట్/J.Dr

రెస్పాండెంట్‌కు ఆర్డర్ 21 రూల్ 22 సివిల్ ప్రొసీజర్ కోడ్ నోటీసు

పై ఎగ్జిక్యూషన్ పిటిషన్ నందు 2 సం॥లు తర్వాత పిటిషన్ వేసి ఉన్నందున రెస్పాడెంట్ అయిన మీకు ఆర్డర్ 21 రూల్ 22 CPC ప్రకారం షోకాజ్ నోటీసు ఇవ్వమని పై కోర్టు వారు ఆదేశించిఉన్నారు. పై పిటిషన్ నందు మీరు హాజరగుటకు గాను 25.09.2025వ తేదీన వాయిదా ఉన్నది. కావున సదరు తేదీన **ఉదయం 10-30 గంటలకు** మీరు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసు. లేనందట మీ పరోక్షమున తీర్మానించబడును

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

జింకా రవి, మెట్టుపల్లె సురేంద్రనాథ రడ్డి
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT : PRODDATUR

I.P.No. 2/2024

Shaik Jamalvalli, S/o Masthan, aged 70 years, muslim, R/o.D.No.14/52-A, Madeena Masjid Street No.1, Proddatur Road, Mydukur Town, Kadapa District. ...Petitioner

Vs

1. Chettukrindi Nayabvalli, S/o Khajavalli, aged 45 years, Muslim, R/o D.No.11/227-1, Near Market, Badvel Road, Mydukur Town, Kadapa District. ...Respondent No.1

నోటీసు

ఈ నెంబరు I.P. పిటిషన్‌లో రెస్పాండెంట్ నెం.1 అయిన మీ పైన పిటిషనర్ రాజశ్రీ కోర్టు నందు I.P. దాఖలు చేసినారు. అట్టి I.P. నందు రెస్పాండెంట్ నెం.1 అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా 07.10. 2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉన్నది. కావున పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥లకు మీరు హాజపై ఏమైనా ఆక్షేపనలు వున్న యెడల మీరు గాని, మీ వకీలు ద్వారా గాని తెలుపవచ్చును. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 07.10.2025

//By Order of the Court//

బి.సి.మాదయ్య
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

నిలిచిన వర్షపునీటిలో విద్యార్థినులు

వర్షపు నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట జూనియర్ కళాశాల, పోలీస్‌స్టేషన్ వెళ్లే దారిలో వర్షపునీరు నిలిచి ఇబ్బందిగా ఉందని, నీటిని తొలగించి, నిలవకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రంతుబాషా కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శి విజయ్‌కమార్ నాయక్‌కు వినతి పత్రమిచ్చారు. కురుస్తున్న వర్షానికి రోడ్డులో మోకాలిలోతు నీరు నిలుస్తోందన్నారు. విద్యార్థులు, పోలీస్‌స్టేషన్ వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. స్పందించిన పంచాయతీ సెక్రటరి మాట్లాడుతూ ఎంపిడిఒ కులాయమ్మ దృష్టికి సమస్యను తీసుకెళతానని తెలిపారు. వేంపల్లె ఎంపిడిఒ కులాయమ్మ చక్రాయపేటకు ఇన్‌చార్జిగా ఉంటున్నారు. సమస్యపై ఆమె మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణానికి అంచనా వేస్తామని హామీ ఇచ్చారు.

వాతలు పెట్టి పూత రాసినట్లుంది జిఎస్‌టిపై మోడీ వైఖరి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలకు వాతలు పెట్టి పూత(ఆయింట్‌మెంట్) రాసినట్లుంది జిఎస్‌టిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వైఖరి అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిఎస్‌టి ప్రజలపై గబ్బర్‌సింగ్ టాక్స్‌గా తయారైందన్నారు. ప్రజలపై విపరీతమైన పన్నుల భారం పడిందన్నారు. ప్రస్తుతం ఉన్న 5,12,18,28 స్లాబులను రద్దుచేసి ఒకే స్లాబ్ చేయాలని, అదీ కూడా ఐదు శాతం స్లాబ్ ఉండాలని చెప్పారు. పెట్రోల్, డీజిల్ కూడా జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ మొదటి నుండి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఎనిమిదేళ్లుగా జిఎస్‌టి నాలుగు స్లాబుల ద్వారా ప్రజలను మోడీ ప్రభుత్వం పీల్చి పిప్పి చేసిందన్నారు. ఇప్పుడేమో నాలుగు స్లాబులను రెండు స్లాబ్ చేసి అదేదో పెద్ద ఘనకార్యమైనట్లు పండగ చేసుకోండి అని ప్రజలకు మోడీ చెప్పడం చాలా హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 5,18 స్లాబుల స్థానంలో 18 స్లాబ్ తొలగించి కేవలం ఐదు స్లాబ్‌నే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. పెట్రోలు, డీజిల్ కూడా జిఎస్‌టి పరిధిలోకి తేవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అప్పుడే ప్రజలకు నిజమైన పండుగని తులసిరెడ్డి పేర్కొన్నారు.

వేణుగోపాల్ రెడ్డి హత్య దారుణం..

ప్రొద్దుటూరుకు చెందిన వడ్డీ వ్యాపారి వేణుగోపాల్ రెడ్డిని కిడ్నాప్, హత్య చేసి కుందూనదిలో పడవేయడం చాలా దారుణమని తులసిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయనడానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వట్టి మాటలు కట్టిపెట్టి శాంతి భద్రతలపై ప్రత్యేకదృష్టి సారించాలని కోరారు.

నేత్రదానం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నేత్రదాత కృష్ణారెడ్డి

నేత్రదానం సామాజిక బాధ్యత అని రక్త, నేత్ర, అవయవ దాన ప్రోత్సాహకులు రమణ పేర్కొన్నారు. మండలంలోని చౌడూరు గ్రామానికి చెందిన నల్లగొండ కృష్ణారెడ్డి(75) ఆదివారం మరణించగా, ఆయన కుటుంబ సభ్యులకు రమణ నేత్రదానంపై వివరించారు. ఇందుకు కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, సుదర్శన్, బయపురెడ్డి అంగీకరించడంతో మృతదేహం నుంచి కార్మియాలను తొలగించారు. ఆరు నెలల వయసు నిండిన చంటి పిల్లల నుంచి వందేళ్ల వయసు వరకు అందరూ నేత్రదానానికి అర్హులేనని రమణ తెలిపారు. ఈ ఆశయం కుటుంబ వారసత్వంగా రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేత్రదాతల సంఖ్య తక్కువ కావడంతో ఒక వ్యక్తి నుంచి సేకరించిన రెండు కార్నియాలను ఇద్దరు అంధులకు అమర్చుతారని తెలిపారు. కార్నియాలను హైదరాబాద్ ఎల్‌వి ప్రసాద్ హాస్పిటల్ సిబ్బంది ప్రకాష్ సేకరించారు.

వినతిపత్రం అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

జిఒ 1793 వెంటనే రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1793ను వెంటనే రద్దు చేయాలని శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం నాయకుల డిమాండ్ చేశారు. ఆమేరకు సోమవారం వారు తహశీల్దార్ కె.వెంకట సాయినాథ్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దొమ్మర కులస్తుల పేరు మార్చి గిరి బలిజ అని గుర్తిస్తున్నట్లు ఇఒ ఇవ్వడం బలిజ కులస్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు. ఇది దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచన చేసి తమ ఆత్మగౌరవం దెబ్బతినేలా కాకుండా బలిజ కులస్తుల గౌరవం కాపాడతారని కోరారు. ఇచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేంద్ర, డాక్టర్ సాయి, వైస్ ప్రెసిడెంట్ ఇండ్ల రామకృష్ణ సంగన్న శంకర్, రాంబాబు, తుపాకుల రమణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.P.No. 51 /2025

మొదల వెంకట ప్రసాద్‌రావు, తండ్రి వెంకట సుబ్బయ్య, వయస్సు 53 సం॥లు, హిందూ, సాకిన్ డి.నెం.12-4-33-4, ఫ్లాట్ నెం.105, నరసారావుపేట టౌన్ & మండలం, పల్నాడు జిల్లా. ...పిటిషనరు/డెబిటార్

Vs

1. చప్పారపు వెంకట కుమారి, భర్త సత్య నారాయణ.
2. ఐనాల లక్ష్మి దేవి, భర్త ఆంజనేయులు
3. గంగల వెంకట రమణ, తండ్రి తిరుపాలయ్య,
4. అరవపల్లి బాల సుబ్బా రావు, తండ్రి ఆంజనేయులు
5. అప్పల బాల క్రిష్ణ మూర్తి, తండ్రి సత్య నారాయణ
6. తల్లూరి రామ క్రిష్ణ ప్రసాద్, తండ్రి సత్య నారాయణ
7. ఊటుకూరు శ్రీనివాస రావు, తండ్రి సత్య నారాయణ
8. ఊటుకూరి నాగరాజు, తండ్రి సత్య నారాయణ
9. ఊటుకూరి నాగ మోహన్ క్రిష్ణ, తండ్రి సత్య నారాయణ
10. దొరెడ్ల వెంకట సుబ్బారావు, తండ్రి ఆంజనేయులు
11. పల్లబోతు మోహన్ రావు, తండ్రి క్రిష్ణా రావు
12. ఉద్దగిరి వెంకట రమణ మూర్తి
13. యక్కల చలపతి రావు, తండ్రి బాలయ్య
14. యక్కల సత్య నారాయణ, తండ్రి బాలయ్య
15. కొల్లిపార పూర్ణచంద్ర రావు
16. పొట్టి మూర్తి కబ్బయ్య, తండ్రి హరినాథ అప్పారావు.
17. కాకుమాను రామా రావు, తండ్రి లక్ష్మణ ప్రభు
18. గంటి నాగ శివ రావు
19. సాకిల శ్రీనివాస రావు, తండ్రి చిట్టి బాబు
20. మునగాల వెంకట రామా రావు

...రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు పిటిషనులోని పిటిషనరు తనని ఇన్సాల్వెంట్గా డిక్లేర్ చేయమని కోరుచూ పై కోర్టు యందు పై నెంబరు డెబిటార్ ఐ.పిని దాఖలు చేసి యున్నాడు. అట్టి ఐ.పి యందు ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పైకోర్టు వారి యెదుట 31.10.2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకోవలెను.

వాయిదా తేది. 31.10.2025

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

జి. వెంకట సుబ్బయ్య,
అడ్వకేట్, ప్రొద్దుటూరు.